Manam_30 March 2018

# భారీగా లక్ష్యం.. అమలులో అలసత్వం..

- బల్దియాపై కాగ్ అక్షింతలు.. ప్రభుత్వ ఆదేశాల అమలులో విఫలం
- ఎన్నో లోపాలున్నాయంటూ ప్రభుత్వానికి నివేదిక

హైదరాబాద్‌సిటీ, మనం ప్రతినిధి

విశ్వనగరంగా హైదరాబాద్ వర్ధిల్లుతుందని రాష్ట్ర పాలకులు పేర్కొంటున్నారు. దేశంలోని పెద్ద నగరాల్లో హైదరాబాద్ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న దానిలో ముందంజలో ఉందని చెప్పుకుంటున్న జీహెచ్ఎంసీకి కాగ్(కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) షాక్ ఇచ్చింది. ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలను కఠినంగా అమలు చేయడంలో విఫలమెందని ఎత్తిచూపింది. గతేడాది వర్షపు ముంపుకు బల్దియా నిర్లక్ష్యమే కారణమంటూ చెరువులను కాపాడడంలో బల్దియా వైఫల్యం చెందిందని తేల్చి చెప్పింది. లక్ష్యాలు భారీగానే ఉన్నా ఆచరణ ఆశాజనకంగా లేదని లెక్కలు చూపింది. 2012-13నుంచి 2016 -17 కాలానికి భవన నిర్మాణ అనుమతులు, ఆస్తిపన్ను, ఘనవ్యర్థాల నిర్వహణ, వరదనీటి కాలువ అనే నాలుగు అంశాల పై లెక్కించి ప్రభుత్వానికి కాగ్ నివేదిక ఇచ్చింది. ఒకప్పటి హైదరాబాద్ నగర పాలక సంస్థ (ఎంసీహెచ్) తో మరో 12 ఇతర మున్సిపాలిటీలను కలిపి 2007 ఏప్రిల్‌లో హైదరాబాద్ మహానగరపాలక సంస్థ(జీహెచ్ఎంసీ) ఏర్పడింది. దీని విస్తీర్ణం 650 చదరపు కిలోమీటర్లు. జీహెచ్ఎంసీ చట్టం-1955 ప్రకారం ఇది విధులు నిర్వహిస్తోంది.



## నివేదికలోని ముఖ్యాంశాలు

ప్రభుత్వం జారీ చేసిన భవన నిబంధనలను అమలు చేయడంలో జీహెచ్ఎంసీ నియమాలు పాటించలేకపోయింది. ఫలితంగా ఆమోదించిన భవన నమూనాలలో మార్పులు, ఇబ్బడిముబ్బడిగా అనధికార నిర్మాణాలు చోటు చేసుకున్నాయి. 2012-17కాలంలో, నమూనా తనిఖీ చేసిన సర్కిళ్లలో 75,387ఆస్తిపన్ను మదింపు అంచనాలలో 30,864(41శాతం)అంచనాల విషయంలో భవన నమూనాల్లో మార్పులున్నట్లు తేలింది.

ఆస్తిపన్ను కట్టకపోవడం/ఆలస్యంగా కట్టడం వంటి విషయాలలో జీహెచ్ఎంసీ పెనాల్టీ నిబంధనలను అమలు చేయడంలో కఠినంగా వ్యవహరించలేకపోయింది. నివాస, నివాసేతర ఆస్తులకు సంబంధించి 2017 మార్చి మిగతా 2లో..

మనం | శుక్రవారం | 30 | మార్చి | 2018

# భారీగా లక్ష్యం.. అమలులో అలసత్వం..

(మొదటి పేజీ తరువాయి)

నాటికి ఉన్న మొత్తం బకాయిలు రూ. 1403.43 కోట్లలో, 1,78,701 అసెస్‌మెంట్ల నుంచి రావలసిన మొత్తం రూ.900.33కోట్లు(64శాతం) మూడేళ్ల నుంచి రాలేదు.

టౌన్‌ప్లానింగ్ విభాగానికి (భవన అనుమతులు)రెవెన్యూ విభాగానికి(వాణిజ్య లైసెన్సులు, ఆస్తి పన్ను) మధ్య డాటా అనుసంధానం లేకపోవడం వల్ల ఆస్తిపన్ను తక్కువగా అంచనా వేయడం జరిగింది. నమూనా తనిఖీ చేసిన ఆరుసర్కిళ్ల ఆడిట్ విశ్లేషణలో 708 అసెస్‌మెంట్లకు సంబంధించి రూ.5.25 కోట్లు తక్కువగా అంచనా వేసినట్లు తేలింది.

4. మొత్తం మున్సిపాలిటీ ఘన వ్యర్థాలలో ప్రాథమిక వ్యర్థాల ఉత్పత్తి యూనిట్ల నుంచి వేరు చేసి సేకరించిన వ్యర్థాలు 27శాతం మాత్రమే. అంతేగాక వ్యర్థాల బదిలీ కేంద్రాల్లో వేరు చేసే సౌకర్యాలు లేకపోవడం వల్ల వ్యర్థాలను చేరవేసే ప్రాంతాలకు అది భారంగా మారుతోంది.

5. వ్యర్థాలను ప్రాసెస్ చేసి జాగ్రత్తగా తొలగించడానికి చేస్తున్న ప్రయత్నాలు ప్రభావవంతంగా లేవు. భూమి అందుబాటులో లేని కారణంగా వ్యర్థాల నుంచి ఇందనం తయారు చేసే ప్లాంట్లు స్థాపించలేకపోయారు. రెండు కొత్త ప్రాసెసింగ్, తొలగింపు యూనిట్లను చౌటుప్పల్, లక్కారంలో ప్రారంభించవలసి ఉన్నది.అందుబాటులో ఉన్న డంపు ప్రదేశాలలోనూ పునరుద్దరించలేదు.

6. నగరంలో వరదనీటి కాలువల బలోపేతానికి ఏడేళ్ల కింద రూపొందించిన ముసాయిదా బృహత్ప్రణాళిక ఇంతవరకు అమలు కాలేదు. నగరంలో 461 వరదనీరు ఆగిపోయే ప్రదేశాలు ఉండగా, అందులో 52 అతిప్రమాదకరమైనవి కాగా 67 పెద్ద రాకపోకల కూడళ్లు. సమీప వరద నీటి కాలువలకు కలిపే వ్యవస్థ అందుబాటులో లేని కారణంగా ఈ నీరు ఎటూ పోలేని ప్రాంతాలన్నీ వర్షాకాలం ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది.

7. కార్పొరేషన్ రూ.350.13కోట్ల అంచనా వ్యయంతో 26 వరదనీటి కాలువలపై 71 విస్తరణ పనులు చేపట్టింది. 2017జూలై నాటికి రూ.187.80 కోట్లు ఈ పనులపై ఖర్చు చేశారు. ఆక్రమణలను తొలగించడంలో బల్దియా వైఫల్యం చెందడం వల్ల 16 పనులు ఆగిపోయాయి.

8. చెరువులను కాపాడడంలో జీహెచ్ఎంసీ వైఫల్యం చెందింది. నాలాలు మరియు చెరువుల చుట్టూ 12,182 ఆక్రమణలు ఉండగా 2017 జూలై నాటికి కేవలం 847(7శాతం) తొలగించారు. 17 సరస్సుల ఆచూకీ తెలుసుకోలేకపోగా, తొమ్మిది సరస్సులు పూర్తిగా దురాక్రమణలకు గురయ్యాయి. చెరువుల ఆచూకీ తెలియకపోవడం చూస్తే వాటిని పరిరక్షించడానికి ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టలేదని తెలుస్తోంది. ఫలితంగా వర్షాకాలం వరద ముంచెత్తడం కొనసాగింది.

Nava Telangana_30 March 2018

# జీహెచ్ఎంసీకి కాగ్ అక్షింతలు



- బల్దియాలో నిర్వహణ అస్తవ్యస్తం
- టౌన్‌ప్లానింగ్, ఆస్తిపన్ను, ఘనవ్యర్థ నిర్వహణ,
- వరదనీటి కాలువ పనుల్లో అవకతవకలు

› వివరాలు 4లో...

జీహెచ్ఎంసీకి కాగ్ అక్షింతలు వేసింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో టౌన్‌ప్లానింగ్, ఆస్తిపన్ను, ఘనవ్యర్థ పదార్థాల నిర్వహణ, వరదనీటి కాలువ విభాగాల పనితీరుపై కాగ్ అక్షింతలు వేసింది. ప్రభుత్వం నియమనిబంధనలు పాటించడంలో బల్దియా విఫలమైందని తప్పుపట్టింది. భవన నిర్మాణ అనుమతులు ఇవ్వడంలోనూ, ఆస్తిపన్ను మదింపులోనూ జీహెచ్ఎంసీ సరిగ్గా వ్యవహరించలేదని పేర్కొంది. ముఖ్యంగా భవన నిర్మాణ అనుమతుల్లో సర్కార్ ఆదేశాలు అమలు చేయకపోవడంతో అక్రమ నిర్మాణాలు పెరిగాయని ఎత్తిచూపింది. నవతెలంగాణ-సిటీబ్యూరో



# జీహెచ్ఎంసీకి కాగ్ అక్షింతలు

(మొదటిపేజీ తరువాయి)

2012-17లో ఆయా సర్కిళ్లలో తనిఖీ చేయడంతో 75,387 భవనాల ఆస్తిపన్ను మదింపులో 30,864 భవనాలు (41శాతం) భవనాల నమూనాల్లో మార్పులున్నట్టు తేలింది. వీటిలో 10,460 భవనాల్లో అక్రమ నిర్మాణాలే ఉన్నాయని నివేదికలో వెల్లడైంది. వీటితో పాటు ఆస్తిపన్ను బకాయిదారులపై జీహెచ్ఎంసీ కఠినంగా వ్యవహరించలేక పోయిందని. దీంతో బల్దియా ఖజానాకు నష్టం వాటిల్లిందని స్పష్టం చేసింది. నివాస, నివాసేతర ఆస్తులకు సంబంధించి 2017 మార్చి వరకు బకాయిలు రూ.1,403.43 కోట్లు కాగా 1,78,701 అసెస్‌మెంట్లకు సంబంధించిన రూ.900కోట్లు (64శాతం) మూడేండ్ల నుంచి వసూలు చేయలేదు. టౌన్‌ప్లానింగ్ విభాగానికి, రెవెన్యూ విభాగానికి మధ్య డేటాబేస్ అనుసంధానం లేకపోవడంతో ఆస్తిపన్ను అంచనాల్లో లోపాలు జరిగాయని గుర్తించింది. తనిఖీలు చేసిన సర్కిళ్లలో 708 అసెస్‌మెంట్లకు సంబంధించి రూ.5.25 కోట్లు తక్కువగా అంచనా వేసినట్టు కాగ్ గుర్తించింది. దీంతో పాటు వరద నీటి కాలువ పనులు, నాలాల విస్తరణలో భాగంగా ఆక్రమణలను తొలగించడంలో జీహెచ్ఎంసీ నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఘనవ్యర్థ పదార్థాల నిర్వహణలోనూ జీహెచ్ఎంసీ తీరు బాగాలేదని పేర్కొంది.

**హెచ్ఎండీఏపై..**

హైదరాబాద్ గ్రోత్ కారిడారు లిమిటెడ (హెచ్‌జీసీఎల్) రూ.15.35 కోట్లు గుత్తాపట్టాదారునికి అధిక చెల్లింపును, వాటిని ఆరేండ్ల నుంచి తిరిగి రాబట్టక పోవడం వల్ల జూన్ 2017 నాటికి రూ.7.37 కోట్ల వడ్డీ చెల్లించాల్సి వచ్చిందని కాగ్ వెల్లడించింది. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్)ను హైదరాబాద్ మెట్రో పాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) స్థాపించింది. హెచ్ఎండీఏ, హెచ్‌జీసీఎల్ మరియు గుత్తాపట్టాదారుల మధ్య ఆగష్టు 2007లో ఒక రాయితీ ఒప్పందం జరిగింది. ఎక్స్‌ప్రెస్ రహదారి నిర్మాణం, నిర్వహణ మరియు మరమ్మతులు చేయడానికి కాంట్రాక్టర్‌కు ఆరు నెలలకు రూ.33.30 కోట్లు చెల్లించాలని ఒప్పందంలో ఉంది. వాణిజ్య నిర్వహణ ప్రారంభం నుంచి పన్నెండున్నర ఏండ్ల పాటు ప్రతి ఏడాదికీ చెల్లించాలి. కానీ ఒప్పందం ఉల్లంఘించి ముందుగానే సగం నిధులు చెల్లించింది. దీని ఫలితంగా హెచ్ఎండీఏకు వడ్డీ రూపంలో రూ.7.37 కోట్ల భారం పడింది. దీంతో పాటు వాణిజ్య భవనాల నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఎత్తిచూపింది. స్వర్ణజయంతి, మైత్రీవనం, మైత్రీ విహార్, హెర్మిటేజ్, తార్నాక వాణిజ్య సముదాయాల నుంచి ఆదాయాన్ని రాబట్టుకోవడంలో హెచ్ఎండీఏ పూర్తిగా విఫలమైంది. ఐదు వాణిజ్య సముదాయాల్లోని 355 దుకాణాలను అద్దెకు ఇవ్వక పోవడంతో హెచ్ఎండీఏకు సుమారు రూ.20.95 కోట్ల నష్టం వాటిల్లింది. అద్దెకిచ్చిన దుకాణాలకు సంబంధించిన బకాయిలు రూ.6.16 కోట్లు పేరుకుపోయాయి. వీటిపై హెచ్ఎండీఏ పట్టించుకోవడంలేదని స్పష్టం చేసింది.

**అగ్నిమాపక చర్యలు అధ్వానం**

హైదరాబాద్ జిల్లాలో అగ్నిమాపక చర్యలు అధ్వానంగా ఉన్నాయని కాగ్ ఎత్తిచూపింది. సుమారు 68లక్షల జనాభా ఉన్న నగరంలో 136 అగ్నిమాపక కేంద్రాలుండాలి. కానీ 38 మాత్రమే ఉన్నాయి. ఇంకా 98 కేంద్రాలు ఏర్పాటు చేయాలి. వీటితో పాటు సుమారు 7 రెస్క్యూ వాహనాలు ఉండాల్సి ఉండగా ఒక్కటి కూడా లేదు. నగరంలో ఒక్క ఫైర్ స్టేషన్‌లేని అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. వీటిలో అంబర్‌పేట్, చాంద్రాయన్‌గుట్ట, గోషామహల్, సికింద్రాబాద్, కంటోన్మెంట్ ఉన్నాయి.

Eenadu_30 March 2018

# ఆస్తుల పంచాయితీ

ఈనాడు, హైదరాబాద్: పంచాయతీరాజ్ సంస్థల పనితీరును కాగ్ నివేదిక దుయ్యబట్టింది. కనీసం సొంత ఆస్తులు కాపాడుకోలేకపోతున్నాయని, అధికారుల పర్యవేక్షణ అసలే లేదని, 30 ఏళ్ల నాటినుంచీ అక్రమ లేఅవుట్లు ఉన్నా గుర్తించే పరిస్థితిలో ఈ సంస్థలు లేవని కాగ్ ఎత్తిచూపింది.



★ తన స్వాధీనంలో ఉన్న భూముల దస్త్రాలు పంచాయతీరాజ్ సంస్థల వద్ద లేకపోవడంతో కరీంనగర్, రంగారెడ్డి జిల్లా పరిషత్‌లు, ఔషాపూర్ పంచాయతీకి చెందిన 26 ఎకరాల 26 గుంటల భూమి దురాక్రమణకు గురైంది.

★ తన సొంత భూమిపై తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థలకు అజమాయిషీ లేకపోవడంతో రూ. 247.50 కోట్ల విలువైన 27 ఎకరాల 20 గుంటల భూమి ఆక్రమణకు గురైంది.

★ లేఅవుట్ నిబంధనలు-2002 ప్రకారం గ్రామపంచాయతీలో అభివృద్ధి చేసిన మొత్తం లేఅవుట్‌లో 10 శాతం ఉచితంగా ఆయా పంచాయతీలకు బదిలీ చేయాలి. 29 పంచాయతీలలో రూ. 90.13 కోట్ల విలువైన మొత్తం 161 ఎకరాల 24 గుంటల భూమి బదిలీ కాలేదు.

★ 2015-16తో పోల్చుకుంటే 2016-17లో పంచాయతీరాజ్ సంస్థల ఆదాయం రూ. 1166.52కోట్ల నుంచి రూ. 981.60కోట్లకు తగ్గింది.

★ రంగారెడ్డి జిల్లా మినహా మిగతా ప్రాంతాల్లో అసలు ఈ అక్రమ లేఅవుట్లు ఎప్పుడు ఏర్పడ్డాయో కూడా చెప్పలేకపోయారు. రంగారెడ్డి జిల్లాలో 58 అక్రమ లేఅవుట్లను మచ్చుకు తనిఖీ చేయగా అవి 30 ఏళ్ల కంటే ముందునుంచీ ఉన్నట్లు వెల్లడైంది.

**పంచాయతీరాజ్ సంస్థలకు ఆర్థిక సాయం (రూ.కోట్లలో)**

| వివరాలు | 2012–13 | 2013–14 | 2014–15 | 2015–16 | 2016–17 | మొత్తం |
|---|---|---|---|---|---|---|
| బడ్జెట్ | 329.27 | 328.89 | 203.18 | 819.04 | 962.16 | 2,642.54 |
| విడుదల | 158.10 | 164.57 | 30.30 | 752.12 | 957.99 | 2063.08 |
| వ్యయం | 98.20 | 114.85 | 30.30 | 622.29 | 957.99 | 1,823.63 |